క్లుప్తంగా

విద్యాకానుక కిట్లు సిద్ధం



విద్యాకానుక కిట్ల వద్ద ఎంఈఓ తదితరులు

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న విద్యాకానుక సిద్ధంగా ఉందని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ఈ విద్యాకానుక యూనిఫాం, నోట్ పుస్తకాలు, వర్క్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగ్‌లను అన్ని పాఠశాలలకు పంపించారు. మండలంలో 67 పాఠశాలలకు సుమారు 7200 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలో పంపిణీ కార్యక్రమాన్ని త్వరలోనే చేపడతామన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



దుకాణంలో విక్రయానికి కూరగాయలు

గొల్లప్రోలు: ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఆదివారం స్థానిక మార్కెట్‌లో కూరగాయల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోయారు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో కిలో టమాటా ధరలు జూన్ 12వ తేదీన రూ.40 ఉండగా , జూన్ 14న రూ.45, ఆదివారం రూ.50 కి విక్రయించారు. కాకరకాయలు కిలో రూ.45 నుంచి 50కు, ఉల్లిపాయలు రూ.30 నుంచి 45కు, బీరకాయలు రూ. 40 నుంచి రూ.60, కాప్సికమ్ రూ.80 నుంచి రూ.98, అల్లం రూ.150 నుంచి రూ. 180కి, కొత్తిమీర కట్ట రూ.30 నుంచి 40కి, తోటకూర, పాలకూర, చుక్కకూర వంటి ఆకుకూరలు కట్ట రూ.10 నుంచి రూ.15 కు పెరిగిపోయాయి. అమాంతంగా పెరిగిన ధరలతో సామాన్యులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ధరల పెరుగుదలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి మత్తులో యువత చిత్తు



వాకతిప్పలో గంజాయిని పీల్చి వదిలిన ప్లాస్టిక్ బాటిల్

కొత్తపల్లి: గంజాయి మత్తులో యువత జీవితాలు చిత్తవుతున్నాయి. కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు బ్యాగ్‌లతో నిర్జన ప్రదేశాలకు వెళ్లి గంజాయి గుప్పుగుప్పుమనిపిస్తున్నారు. గంజాయిని ఒక్కో ప్రాంతంలో షార్ట్ కట్‌లో ఒక్కో పేరుతో పిలుస్తూ పక్క వారికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యంగా ఉప్పాడ బీచ్ రోడ్డు, నాగులపల్లి, వాకతిప్ప, కొత్తమూలపేటలో పలు పుంత రోడ్డులో, ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు యువత చేరుతున్నారు. నలుగురు యువకులు ఒక చోటకు చేరి గంజాయి గుప్పుమనిపిస్తుంటే మరికొందరు ద్రవ రూపంలో ఉన్న మత్తు పదార్థాన్ని ప్లాస్టిక్ సోడా బాటిళ్లలో నింపి గొట్టం ద్వారా పీల్చి ఆనందిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్సై స్వామినాయుడును వివరణ కోరగా గంజాయి విక్రయాలు చేసినా, కాల్చినా కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిపై ప్రత్యేక దృష్టి పెడతామని పేర్కొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కె.లక్ష్మీదుర్గ నూతనంగా ఏర్పాటు చేసిన 'మీ కోసం రత్నశ్రీ సేవా సంస్థ' ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు చీరలు ఉచితంగా పంపిణీ చేశారు. రమణయ్యపేటలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు బొండా సూర్యారావు, రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, రాజు, గణపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాన్న ఒక రక్షణ కవచం

కాకినాడ రూరల్: కుటుంబానికి రక్షణ కవచంగా నాన్న నిలుస్తాడని, బాధ్యతలను మోస్తూ ఎన్నో త్యాగాలు చేసే నాన్నను వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరూ కంటికి రెప్పలా కాపాడుకోవాలని లయన్ ఇందుగుల ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ పితృ దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు అమ్మ తొలి అడుగు వేయిస్తే నాన్న ప్రగతిని చూపుతాడన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాఘవరావు పాల్గొన్నారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి



సామర్లకోటలో కురిసిన వర్షం



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం



బ్రౌన్‌పేటలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టు కొమ్మలు

ఉదయం ఉష్ణతాపం.. సాయంత్రం వర్షపాతం

- విభిన్న వాతావరణ పరిస్థితులతో అల్లాడిన నియోజకవర్గ ప్రజలు
- ఈదురు గాలులతో కూలిన చెట్లు
- త్రుటిలో తప్పించుకున్న వాహన చోదకుడు
- రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: జూన్ రెండో వారం వచ్చినా భానుడు తన ప్రతాపాన్ని చూపుతూనే ఉన్నాడు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేడి గాలులతో, 39 డిగ్రీలతో ఎండలు మండి పోవడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఎండలకు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కావడంతో అనేక మంది పార్కులకు వెళ్లడానికి సిద్ధం కాగ ఎండకు హడలిపోయారు. వర్షాలు పడే రోజుల్లో ఎండలు తగ్గకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. అయితే నాలుగున్నర తరవాత వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో వర్షం పడింది. దీంతో అనేక వృక్షాలు నేల కూలాయి. దాంతో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం వల్ల పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, జయలక్ష్మి థియేటర్, సత్యనారాయణపురం, గాంధీ నగర్, భాస్కర్‌నగర్, వెలమపేట జలమయం అయ్యాయి.

కూలిన చెట్లు.. ప్రకృతి విధ్వంసం

ఈదురు గాలుల వల్ల అనేక ప్రాంతాల్లో చెట్లు కూలి ప్రకృతి విధ్వంసం సృష్టించింది. సామర్లకోట - ఉండూరు రోడ్డు రైల్వే గేటుకు ఇరువైపులా రెండు వృక్షాలు కూలిపోయాయి. ఉండూరు నుంచి సామర్లకోట వస్తున్న ఒక మోటారు సైకిల్‌పై చింత చెట్టు కూలిపోయింది. ఈ సంఘటనను గమనించి వాహనచోదకుడు ఒకసారిగా సైకిలు నుంచి దూకి ప్రాణాలను రక్షించుకున్నాడు. దాంతో సామర్లకోట-ఉండూరుకు రాక పోకలు నిలిచి పాయాయి. దాంతో అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించారు. అదే విధంగా సామర్లకోట-కాకినాడ రోడ్డులో అనేక చెట్లు కూలిపోయాయి. దాంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సామర్లకోట పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని కూలిన చెట్లను తొలగించారు. బ్రౌన్‌పేట పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో అనేక చెట్లు విద్యుత్ వైర్లపై కూలిపోయాయి. దాంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. రాత్రి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

కొత్తపల్లిలో భారీ వర్షం

కొత్తపల్లి: మండలంలో ఆదివారం వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించింది. భారీ వాన కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లు ఆక్రమణకు గురికావడంతో మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కురిసిన భారీ వర్షంతో ఆదివారం సాయంత్రం భారీ శబ్దాలతో పిడుగులు పడ్డాయి. వాకతిప్పలో ఉన్న ఊర చెరువు గట్టుపై ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పిడుగు పడడంతో రెండు కొబ్బరి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదు.



పిడుగుపాటుకు కాలిపోతున్న కొబ్బరిచెట్లు



సామర్లకోట - ఉండూరు రోడ్డులో మోటారు సైకిల్‌పై కూలిన చింతచెట్టు

వేసవి తాపం.. అంతలోనే ఉపశమనం..



పెద్దాపురం-సామర్లకోట రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

పెద్దాపురం: అకాల వర్షంతో పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధులు జలమయయ్యాయి. ఆదివారం ఉదయం వేసవి తాపానికి గురైన ప్రజలు సాయంత్రం చల్లబడిన వాతావరణంతో సేద తీరారు. గంటల తరబడి కురిసిన కుండపోత వర్షానికి పట్టణ ప్రాంతంలోని మురికివాడలు జలమయ్యాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో ఏరులై పారడంతో కాలువలోని మురుగు రోడ్లపైకి వచ్చి అధ్వానంగా తయారైంది. మున్సిపల్ సెంటర్, కబడ్డీ వీధి, నాయీ బ్రాహ్మణ కాలనీ, గోలి వారి వీధి, శివాలయం వీధి, మెయిన్‌రోడ్డుతో పాటు పలు మురికి వాడల్లో ప్రజలు ఆ మురుగునీటితో నానా అవస్థలు పడుతున్నారు. మురికివాడల్లో శానిటేషన్ పనులు సక్రమంగా జరగడపోవడం, పలు వార్డుల్లో సరైన రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికై నా పురపాలక యంత్రాంగం స్పందించి ఆయా మురికి వాడల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శుభ్రం చేయకపోగా చేపల వేట కూడానా!



సామర్లకోట ఫిల్టర్ చెరువులో చేపల వేట

- ఫిల్టర్ చెరువు పరిస్థితిపై పట్టణ ప్రజల ఆగ్రహం
- గోదారి నీరూ పాడయ్యే అవకాశం

సామర్లకోట: పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే చెరువులో నీరు నాచు రంగులో ఉండటంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. ఆ ఆందోళనలో ప్రజలుంటే చెరువులో చేపల వేట ప్రారంభించడంతో పట్టణ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఏటా సముద్ర వేట నిషేధ సమయంలో అధికారుల అనుమతితో ఫిల్టర్ చెరువులో చేపలవేట సాగిస్తుంటారు. గతంలో చెరువులో చేపల వేట జరిగే సమయంలో వెనుక భాగంలోనే బోట్లను నిలిపి చేపలు వేటాడేవారు. అయితే ప్రస్తుతం మున్సిపాలిటీ ఫిల్టర్ ప్లాంటుకు నీరు వెళ్లే వైపు వరకు బోట్లతో చేపల వేట సాగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువులో నీరు ఆకుపచ్చరంగులో ఉన్న సమయంలో చేపల వేట సాగిస్తే నీరు మరింత కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువకు నీరు రావడంతో మున్సిపల్ అధికారులు ఆ నీటిని నేరుగా ఫిల్టరు చెరువుకు మళ్లించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై వివరణ కొరడానికి ప్రయత్నం చేయగా మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అందుబాటులో లేరు.

కార్మికులను తొలగించడం తగదు



రాక్ సిరామిక్స్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: ప్రైవేటు పరిశ్రమలు కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ గత ఏడు రోజులుగా గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తూ ఉంటే కొంత మంది కార్మికులను ఫ్యాక్టరీ అధికారులు పిలిచి సమస్యలపై చర్చించకుండా పోలీసులతో లాఠీచార్జి చేయిస్తామని వారిని బెదిరించడం దారుణమన్నారు. ఇటువంటి హెచ్చరికలు మానుకోక పోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఫ్యాక్టరీ నుంచి తొలగించిన కార్మికులను విధులలోనికి చేర్చుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



గణేష్‌కు చికిత్స చేస్తున్న వైద్యుడు

కరప: మండలం నడకుదురు సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద కారు ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరప గ్రామానికి చెందిన పోలిశెట్టి గణేష్ ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై కాకినాడ వెళ్తుండగా నడకుదురు, తూరంగి గ్రామాల మధ్య ఉండే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి ఉప్పలంక వైపు నుంచి ఇంద్రపాలెం వైపు వెళ్లే కారు బలంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గణేష్‌కు చేతులపైన, కాళ్లపైన, తలవెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో ఉన్న నలుగురు యువకులు స్పందించి క్షతగాత్రుని ఫోన్ నుంచే బంధువులకు సమాచారం అందించి, కరప తీసుకొచ్చి అప్పగించారు. కరపలో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం బంధువులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప వద్ద గొయ్యి పూడ్చి మట్టి, రాళ్లను వదిలేసిన వైనం

కొత్తపల్లి: పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గొయ్యి తవ్వి వదిలేశారు. ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న పైప్‌లైను లీకు కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గోతులు తీసి పూర్తిగా పూడ్చకుండా, గొయ్యి వద్ద పేర్చిన రాళ్లను కూడా తీయడం లేదు. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టినప్పటికీ గోతిని పూడ్చలేదు. గొయ్యి రోడ్డు మధ్యలో ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏం ప్రమాదం సంభవిస్తుందోనని భయభ్రాంతులకు గురువుతన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శ్రీశ్రీకి ఘనంగా నివాళులు



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వక్తలు

పెద్దాపురం: ఎందరో కవులకు ఆదర్శప్రాయంగా నిలచి కవులను తయారు చేసిన కవులకర్మాగారం శ్రీశ్రీ అని పలువురు వక్తలు అన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతిని ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన సాహితి స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, జిల్లా అధ్యక్షులు జోస్యుల కృష్ణబాబు, డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ మాట్లాడతూ నిరంతరం కష్టజీవులకిరువైపులా కాపు కాసేవాడే కవి అని నిరూపించిన వ్యక్తి శ్రీశ్రీ అన్నారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొత్త శివ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, వీర్రాజు. అమృత, తాడిగడప సుబ్బారావు, విమలారాణి, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

సృజన పరీక్షించేలా చెకుముకి ప్రశ్నావళి



చెకుముకి ప్రశ్నల నిధి వర్క్ షాపులో మాట్లాడుతున్న రామచంద్రయ్య

కాకినాడ సిటీ: కచ్చితత్వం, శాస్త్రీయత, శాస్త్రీయ దృక్పథం జనవిజ్ఞాన వేదిక ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి ప్రశ్నల్లో ప్రతిఫలించాలని నిట్ వరంగల్ విశ్రాంత ప్రొఫెసర్ ఎం.రామచంద్రయ్య అన్నారు. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు కాకినాడ ఐడియల్ కళాశాలలో నిర్వహిస్తున్న చెకుముకి ప్రశ్నల నిధి వర్క్ షాపులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి మన విద్యా వ్యవస్థ ప్రధానంగా విద్యార్థుల్లో ధారణాశక్తిని పరీక్షించేలా ఉందన్నారు. దానికి భిన్నంగా చెకుముకి ప్రశ్నల్లో విద్యార్థుల అవగాహనను, నిత్యజీవిత వినియోగం, సృజనాత్మకతను పరీక్షించేలా అంశాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త, ఉమ్మడి ఏపీ పూర్వ ప్రధాన కార్యదర్శి సి.మోహన్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను సాధారణంగా నిర్వహించే టాలెంట్ టెస్టులకు భిన్నంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ చెకుముకి పరీక్షను మరింత శాస్త్రీయంగా, వినూత్నంగా నిర్వహించేందుకు, ప్రశ్నలను తయారు చేయడానికి ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని వివరించారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథ ప్రచారం విస్తృతం కావడానికి, చెకుముకి ప్రతిష్ట మరింత ఇనుమడించడానికి ఈ వర్క్‌షాపు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన రిసోర్స్‌పర్సన్లు సాంఘిక, భౌతిక, జీవ, గణితశాస్త్రాల్లో, శాస్త్ర సాంకేతికత అనే విభాగాలుగా విడివడి పాత ప్రశ్నాపత్రాలను విశ్లేషించి ప్రశ్నలను తయారు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పాట్రన్ చల్లా రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర చెకుముకి కన్వీనర్ కేఎంఆర్ఆర్ ప్రసాద్, కన్వీనర్ జి.గిరిధర్, సభ్యులు మేకా సుబ్బారావు, వి.రామారావు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్లు, జిల్లా కమిటీ సభ్యులు యూ. సత్యనారాయణరెడ్డి, బీవీవీ సత్యనారాయణ, సీహెచ్ రాజ ఉమామంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

వృక్షం పునర్జన్మకు ఆల్ ఈజ్ వెల్ కృషి



సూర్యారావుపేటలో కూలిన చెట్టు



జంతుహింస నివారణ సంఘంలో చెట్టును పాతిపెట్టిన ఆల్ ఈజ్ వెల్ సభ్యులు

బోట్‌క్లబ్: సుమారు 40 ఏళ్ల నాటి వృక్షం నాలుగు రోజుల క్రితం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. రోజూ ఆ మార్గం మీదుగా వెళ్తూ ఆ చెట్టును చూసే వారు వారికి తెలియకుండానే దానిపై ప్రేమ పెంచుకున్నారు. ప్రస్తుతం ఆ చెట్టు కూలిపోవడంతో వారు మనోవేదన వ్యక్తంచేస్తున్నారే తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితి. ఈ విషయం తెలుసుకున్న ఆల్ ఈజ్ వెల్ సంస్థ సభ్యులు ఆ చెట్టును తిరిగి బతికించేందుకు కృషి చేస్తున్నారు. సూర్యారావుపేటలో పడిపోయిన ఆ చెట్టును వారు అక్కడి నుంచి తరలించి నాగమల్లితోట సమీపంలో ఉన్న జంతు హింస నివారణ కేంద్రంలో పాతిపెట్టి చిగురింపజేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రయత్నం విజయవంతమైతే పడిపోతున్న మరిన్ని మొక్కలను రీ ప్లాంటేషన్ చేయడానికి ఆ సంస్థ సభ్యులు కిషోర్, అతని బృందం సిద్ధంగా ఉన్నారు.